క్లుప్తంగా

75శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు



గడ్డి విత్తన బస్తాలను పంపిణీ చేస్తున్న గంగాధర్

నారాయణఖేడ్: గడ్డివిత్తనాలను 75శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ డా.గంగాధర్ తెలిపారు. ఖేడ్ పశువైద్యశాల ఆవరణలో రైతులు, పశుపోషకులకు మంగళవారం సబ్సిడీ విత్తన బస్తాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఐదు కిలోల విత్తన బస్తా ధర రూ.493 కాగా, సబ్సిడీ పోను రూ.123లకే అందిస్తున్నామన్నారు. 10 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. అవసరమైనవారు ఆధార్‌కార్డుతో రావాలని సూచించారు.

కార్మికుల సమస్యపై పోరాటం



మాట్లాడుతున్న చిరంజీవి

నారాయణఖేడ్: కార్మికుల సమస్యలపై నిరంతరంగా పోరాడతామని ఏఐటీయూసీ జిల్లా నాయకులు చిరంజీవి పేర్కొన్నారు. ఖేడ్‌లో మంగళవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. త్వరలో సంగారెడ్డిలోని టీఎన్‌జీఓఎస్ భవన్‌లో సంఘం జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సంఘం బాధ్యులు అశోక్, కాశీనాథ్, శివరాజ్, పండరి పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి కృషి



పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ బి.పుష్ప అన్నారు. మంగళవారం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్ కాలనీ 10వబ్లాక్‌లో ఆమె పర్యటించారు. నూతనంగా పూర్తి చేసిన డ్రైనేజీ పైప్‌లైన్ పనుల పరిశీలించారు. డ్రైనేజ్ పైప్‌లైన్ పనులకు కోసం రోడ్లను తవ్వడం జరిగిందన్నారు. రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, లింగయ్య, నరసింహ తదితరులున్నారు.

మొక్కలు విరివిగా నాటాలి



మొక్కలు నాటుతున్న కమిషనర్ దశరథ్

జిన్నారం (పటాన్‌చెరు): వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ దశరథ్ అన్నారు. మంగళవారం వందరోజుల ప్రణాళికలో భాగంగా వనమహోత్సవం కార్యక్రమాన్ని అన్నారం గ్రామంలో చేపట్టారు. శివాలయం పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చదనం పరిశుభ్రతలో ప్రజలు బాధ్యతగా పాల్గొని మొక్కలు నాటాలని సూచించారు. వారివారి ఇంటి పరసర ప్రాంతాలను శుభ్రంగా ఉండేలా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బోనాల జాతర



బోనంతో మహిళ విన్యాసం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ముంగి, గుంజోటి, డప్పూర్, వడ్డి తదితర గ్రామాల్లో మంగళవారం ఘనంగా బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. డప్పుచప్పుల మధ్య పోతురాజులు చేసిన నృత్యాలు ప్రజలకు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

వర్షం.. రైతుల హర్షం

ముమ్మరంగా వ్యవసాయ పనులు

- పత్తి, మొక్కజొన్న పంటలో అంతర కృషి
- పురుగు మందుల పిచికారీ

జహీరాబాద్: వర్షాలు కురుస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. జహీరాబాద్ ప్రాంతంలో గత నాలుగు రోజుల క్రితం వర్షం పడడంతో ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లయింది. సోమవారం కురిసిన వర్షం జల్లులు పంటలకు మరింత బలాన్నిచ్చాయి. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాల ఆరంభంలో ముఖం చాటేయడంతో ఆలస్యంగా విత్తనాలు విత్తుకున్నారు. దీంతో రైతులు మొక్కజొన్న, సోయాబీన్ పంటల సాగుపై ఆసక్తి చూపారు. మొక్కజొన్న పంటలో కత్తెరపురుగు నివారణ కోసం మందులను పిచికారీ చేస్తున్నారు. కలుపు మొక్కలు అధికంగా ఉన్నట్లయితే గడ్డి మందులను పిచికారీ చేయడం లేదా ఎడ్ల అరకలతో అంతరకృషి పనులు ముమ్మరంగా సాగున్నాయి. పంటలు ఎండుతున్న తరుణంలో వర్షాల రాక రైతులకు ఎంతో లాభానిచ్చింది. ప్రస్తుతం మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. సోయాబీన్ పంటలు సైతం వర్షాల వల్ల ఏపుగా పెరిగి వస్తున్నాయి. వర్షాలు ముఖం చాటేసిన సందర్భంలో భూమిలో తేమలేనందున సోయాబీన్ పంటలకు గడ్డ మందును పిచికారీని వాయిదా వేస్తూ వచ్చారు. వర్షాలు పడడంతో కలుపు నివారణ మందులను పిచికారీ చేస్తున్నారు. మందుల పిచికారీకి ట్రాక్టర్లను ఉపయోగించుకుంటున్నారు. చేతి పంపులతో మందులను పిచికారీ చేసే వారు అందుబాటులో లేకపోవడంతో ట్రాక్టర్లకు ట్యాంకులను బిగించిన రైతులకు సంబంధించిన ట్రాక్టర్లను అద్దెకు తీసుకుని మందులను పిచికారీ చేస్తున్నారు. దీంతో సౌకర్యంగా మారిందని రైతులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే పత్తి పంటలో ట్రాక్టర్ల సహాయంతో అంతర కృషి పనులు చేపట్టారు. దీంతో ట్రాక్టర్ యజమానులకు చేతినిండా పని దొరకడంతో బిజీగా ఉన్నారు.

ట్రాక్టర్ సహాయంతో కలుపు మందు పిచికారీ



ఎరువులు చల్లే పనుల్లో బిజీ

పంటలకు తగినంత వర్షం పడడంతో రైతులు ఎరువులు వేసే పనులను ముమ్మరంగా చేసుకుంటున్నారు. కూలీల సహాయంతో మొక్కజొన్న, కంది, పత్తి పంటలకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు వేసుకుంటున్నారు. సోమవారం కురిసిన వర్షాలకు భూమిలో తగినంత తేమ ఉండడంతో ఎరువులు చల్లుకుంటున్నారు.

కంగ్టిలో భారీ వర్షం

కంగ్టి(నారాయణఖేడ్): జిల్లాలో అత్యధికంగా 98.6 మిల్లీ మీటర్ల వర్షం సోమవారం సాయంత్రం గంటన్నర పాటు కురిసింది. దీంతో చెరువులు, వాగులు, కుంటల్లో నీరు చేరాయి. శనివారం సాయంత్రం 71.4 మిల్లీ మీటర్లు వర్షాపాతం నమోదు కాగా రెండు రోజుల్లో వ్యవధిలో 17 సెంటీమీటర్లు వర్షం కురిసింది. గత నెల ప్రారంభంలో కురిసిన వర్షాలకు నేలలో విత్తనాలు వేసిన రైతులు నెల రోజుల పాటు చినుకు రాలక వాడుతున్న పంటలతో వర్షం కోసం ఆశగా ఎదురు చూశారు. ఆదివారం నుంచి వ్యవసాయం పనులు ఊపందుకున్నాయి. వరి వేయడానికి రైతులు ట్రాక్టర్ల సాయంతో మడులు తయారు చేస్తున్నారు. కంగ్టి నుంచి భీంరా వ్లోరోడ్డు వద్ద వంతెన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. పంట చేలల్లో చాలా చోట్ల గండ్లు పడి మట్టి తెట్టలు వేశాయి.



కంగ్టి: ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

29న నూతన రేషన్ కార్డుల పంపిణీ

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: లబ్ధిదారులందరికీ ఆహార భద్రత అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు అందిస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈ నెల 29న నియోజకవర్గ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో రేషన్ కార్డు ప్రొసీడింగ్ పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయా మండలాల తహసీల్దార్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని గుమ్మడిదల, జిన్నారం, అమీన్‌పూర్, పటాన్‌చెరు, రామచంద్రపురం రెవెన్యూ మండలాల పరిధిలో నూతన రేషన్ కార్డులకు 9414 దరఖాస్తులు రాగా.. అర్హులైన 2096 దరఖాస్తులు ఆమోదించి..పంపిణీకి సిద్ధం చేశామని చెప్పారు. ప్రస్తుతం నియోజకవర్గం వ్యాప్తంగా 74,214 రేషన్ కార్డులు వినియోగంలో ఉన్నాయని తెలిపారు. నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని.. అర్హులైన ప్రతి ఒక్కరూ మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రేషన్ కార్డుల ద్వారా బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు లేకుండా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్లను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్లు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాములు గౌడ్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

నిరుపేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

పటాన్‌చెరు టౌన్: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ రెహమాన్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ద్వారా సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. చికిత్స నిమిత్తం రూ.1.50 ఎల్‌ఓసీ మంజూరు అయింది. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెహమాన్ కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అనుమతి పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు తరలిన నాయకులు



శిక్షణకు తరలివెళ్తున్న నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్రస్థాయి సామాజిక శిక్షణ తరగతులకు సంఘం సంగారెడ్డి జిల్లా నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.అశోక్ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు సూర్యాపేట జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి సామాజిక శిక్షణ తరగతులు జరుగుతున్నాయన్నారు. దేశవ్యాప్తంగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో కుల వివక్షకు, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అంబేడ్కర్ అభయ హస్తంను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలని, ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. శిక్షణకు తరలివెళ్ళిన వారిలో కేవీపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, సహాయ కార్యదర్శులు గణపతి, జయరాం, మహేశ్ జిల్లా నాయకులు గంగారామ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మొక్కలు నాటుతున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజశ్రీ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిజాంపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ సబ్జెక్ట్‌ల్లో ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల ప్రతిభను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాజశ్రీ మాట్లాడుతూ.. పర్యావరణం పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని, తమ వంతు బాధ్యతగా మొక్కలను విరివిగా నాటాలని సూచించారు. నిజాంపూర్ (కే) పాఠశాల విద్యార్థులు అమ్మపేరుతో మొక్కలు నాటుతూ యాప్‌లో అప్‌లోడ్ చేయడంతో అభినందించారు. నిజాంపూర్ (కే) పాఠశాల పర్యావరణ పరిరక్షణ విభాగంలో రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్న నేపథ్యంలో హెచ్‌ఎం రామకృష్ణను, ఉపాధ్యాయులు నవనీత, సునీతలను ప్రత్యేకంగా అభినందించారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్

జిన్నారం (పటాన్‌చెరు): రైతులు పంటల సాగులో మోతాదుకు మించి యూరియా, సేంద్రియ ఎరువులు వాడొద్దని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం గుమ్మడిదల మండల రైతులకు అవగాహన కల్పించారు. ఈ వానాకాలం మండల వ్యాప్తంగా 9500 ఎకరాల్లో వరి, మక్కలు, పత్తి, కంది, ఇతర కూరగాయల పంటలను పండించే అవకాశముందన్నారు. పంట సాగు సమయంలో యూరియా, సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల భూమి యొక్కసారం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. వీటికి బదులు నానో డీఏపీ వాడకంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. నానో డీఏపీ ఎకరానికి 1/2 లీటర్లు సరిపడుతుందన్నారు. దీంతో అతి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చన్నారు. వరి సాగులో జింక్ లోపం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. నివారణకు జింక్ సల్ఫేట్‌ను రెండు గ్రాములు మోతాదును ఒక లీటర్ నీటిలో కలిపి వారానికి రెండు రోజులు పిచికారీ చేయాలని రైతులకు వివరించారు.



నానో ఎరువులపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

ఉపాధ్యాయుల సర్దుబాటు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లాలో ఆయా పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో 349 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత మండల విద్యాధికారులు , కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి పరిధిలో సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఆదేశించారు. సర్దుబాటు చేసిన పాఠశాలకు సంబంధించి ఎంఈఓ, కాంప్లెక్స్, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బుధవారం ఉదయం లోగా రిపోర్టు చేయాలన్నారు.

టీటీయూ సభ్యత్వ నమోదు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని ఎల్లారం, ఆత్మకూర్, బొబ్బిలిగామ, మాచిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం టీటీయూ టీచర్స్ యూనియన్ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో వెంటనే హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి,పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు శెట్టి రవికుమార్, శంకర్, రాములు, జగమోహన్, ఆనంద్ కుమార్, భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకారం అందించడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగదీశ్వరి అన్నారు. మంగళవారం పట్టణ శివారులోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో పూర్వ విద్యార్థులు 20 బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తమ స్వంత డబ్బులతో బెంచీలను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.

ఓటర్ల జాబితా రూపొందించాలి

కంది(సంగారెడ్డి): ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా రూపొందించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం రానున్న పంచాయతీ ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ రూపొందించిన ముసాయిదా ప్రకారం ఓటర్ల జాబితా వార్డుల విభజన వంటి అంశాలపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1.1.2025 నాటికి ఓటర్ జాబితాలో ఉన్న కుటుంబ సభ్యులందరినీ ఒకే వార్డులో చేర్చాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో వచ్చే అవకాశం ఉన్నందున విభజన, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్ జాబితాతో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే గ్రామాల్లో హరితహారం, ఉపాధి హామీ, పారిశుద్ధ్యం, క్లీన్ అండ్ గ్రీన్, గ్రామ పంచాయతీలో డేటాను ఆన్‌లైన్ చేయడం వంటి పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ శాకాంబరీగా సరస్వతీ మాత

జహీరాబాద్ టౌన్: పట్టణ పరిధి దత్తగిరి కాలనీ లోని సరస్వతీ దూవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు భక్తులకు శాకాంబరీ అవతారంలో దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా లలిత సహస్ర నామ పారాయణం, సరస్వతీ స్తోత్రములు, అన్నపూర్ణ అష్టకం, హనుమాన్ చాలీ సా, కాలభైరవాష్టకం తదితర స్తోత్రాలను పఠించారు.

◆ సామూహిక సీమంతాలు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని జమ్గి(కే) గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆదేశాల మేరకు గర్భవతులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. గర్భవతులకు పండ్లు, ఫలాలతో సన్మానించారు. కార్యక్రమంలో మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జహీరాబాద్: నియోజకవర్గంలోని న్యాల్‌కల్, కోహీర్, మొగుడంపల్లి, ఝరాసంగం, జహీరాబాద్ మండలాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి రూ.9.53 లక్షల చెక్కులు మంజూరయ్యాయి. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఆత్మకమిటీ చైర్మన్ పి.రామలింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు హన్మంత్ రావు పాటిల్, మక్సూద్ అహ్మద్, ఎం.జి.రాములు, చెక్కులను అందజేశారు.

◆ చిత్రలేఖన పోటీలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఈదులనాగులపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో మంగళవారం ఓ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజయం సాధించిన అభినాయక్, మనోహర్, మనోజ్ఞలకు బహుమతులు అందజేశారు.

◆ గృహ ప్రవేశాలు చేస్తాం

జహీరాబాద్ టౌన్: హోతి(కె) వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల తాళాలను వెంటనే అప్పగించాలని, లేకుంటే లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశాలు చేస్తామని సీపీఎం నాయకులు మహిపాల్ హెచ్చరించారు. మంగళవారం లబ్ధిదారులతో కలిసి ఆర్డీఓ రాంరెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. లబ్ధిదారులకు ఇళ్ల అప్పగింతలో తీవ్ర జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. అభ్యంతరాలు స్వీకరించిన తరువాత స్క్రూటినీ చేసి తాళాలు అప్పగిస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారని గుర్తు చేశారు. ఇచ్చిన గడువు ముగిసిన ఇంతవరకు ఇళ్ల తాళాలను ఇవ్వడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాలయాపన చేస్తే లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయిస్తామని తేల్చి చెప్పారు. ఆర్డీఓ రాంరెడ్డి సానుకూలంగా స్పందించారని, త్వరలో నిర్ణయం చెబుతామని పేర్కొన్నారు.

◆ శ్రీశైలానికి ప్రత్యేక టూర్

నారాయణఖేడ్: శ్రావణమాసం పురస్కరించుకుని ఖేడ్ నుంచి శ్రీశైలం ప్రత్యేక టూర్ ప్యాకేజీతో బస్సులు నడుపుతున్నట్లు ఖేడ్ డీఎం మల్లేశయ్య తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడు తూ బస్సులు ఈనెల 27న ఉ.8 గంటలకు మంగల్‌పేట్ బస్టాండ్ నుంచి బయలుదేరి సా. 6 గంటలకు శ్రీశైలం చేరుకుంటాయన్నారు. దర్శనం అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 28న రాత్రి 12 గంటలకు ఖేడ్‌కు చేరుకుంటాయన్నారు. ఒకొక్కరికి రాను, పోను ఛార్జి సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్సుకు రూ.1,500, సూపర్ డీలక్స్‌కు రూ.1,700 ఉంటుందన్నారు.

◆ ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

నారాయణఖేడ్: ఆయిల్‌పామ్ మొక్కలు, డ్రిప్ పరికరాలపై 90శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు నాగల్‌గిద్ద వ్యవసాయ అధికారి ప్రవీణ్‌చారి తెలిపారు. మంగళవారం ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లాకు ప్రభుత్వం గోద్రెజ్ ఆగ్రోవేట్ సంస్థను ప్రభుత్వం నియమించిందన్నారు. మొదట నాలుగేళ్ల పంట నిర్వహణ, అంతర పంటల ఖర్చు నిమిత్తం ఎకరాకు రూ.4,200 సబ్సిడీ అందించనున్నట్లు వివరించారు. దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే పంట కొనుగోలు చేస్తారని అన్నారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకం ద్వారా వివిధ పండ్ల, తోటలకు, కూరగాయల పంటలు, ఉల్లిపంటకు ప్లాస్టిక్ మల్చింగ్ సబ్సిడీ గురించి ఉద్యానవన అధికారిణి మౌనిక రెడ్డి వివరించారు. ఏఈఓలు వినయ్, సంతోష్, మహిపాల్ పాల్గొన్నారు.

ఇంటింటికీ 'చికెన్' కూల్‌డ్రింక్ పంపిణీ

జోగిపేట(అందోల్): జోగిపేటలోని 11వ వార్డు ప్రజలకు కులమతాలకు అతీతంగా మాజీ కౌన్సిలర్ శరత్‌బాబు ఇంటింటికి కిలో చికెన్, కూల్ డ్రింక్ బాటిల్‌ను మంగళవారం పంపిణీ చేశారు. వార్డులో గడపగడపకూ తిరుగుతూ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనుచరులతో కలిసి వార్డులో సుమారు 200 వందల కుటుంబాలకు కేజీ చికెన్, కూల్ డ్రింక్స్ అందజేశారు. ఈ సందర్భంగా శరత్‌బాబు స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలోమహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శరత్‌బాబు మాట్లాడుతూ.. 11వ వార్డులోని ప్రజలు అందరూ వ్యవసాయ ఆధారిత, రైతు కూలి కుటుంబాలు కావున మహంకాళి తల్లి చల్లని దయ కరుణ కటాక్షలతో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు మంచిగా పండి వార్డు ప్రజలు, మున్సిపల్ ప్రజలు సుఖసంతోషలతో సుభిక్షంగా వుండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.



ఇంటింటికి చికెన్, కూల్ డ్రింక్ పంపిణీ చేస్తున్న శరత్ బాబు

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ రవీందర్

జోగిపేట(అందోల్): పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని జోగిపేట మున్సిపల్ కమిషనర్ ఏ.రవీందర్ అన్నారు. మంగళవారం అందోల్‌లోని గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కాంపోస్ట్ పిట్‌పై ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. శుష్క వ్యర్థాలు, తడి వ్యర్థాలను వేరు చేయడం, వాటిని సక్రమంగా నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. నాలుగు అడుగుల లోతు గుంట తవ్వి తడి వ్యర్థాలను వేసి కాంపోస్ట్ తయారు చేయవచ్చని విద్యార్థులకు వివరించారు. అలాగే, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్ పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లింగారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు వివరిస్తున్న కమిషనర్

అతిగా ఆలోచించొద్దు

మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ మధు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మధు

న్యాల్‌కల్(జహీరాబాద్): మానసిక ఒత్తిడి భయం వల్ల దగ్గు, జ్వరం లాంటివి వస్తుంటాయని అందుకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సంగారెడ్డికి చెందిన మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ మధు అన్నారు. న్యాల్‌కల్‌లోని కేజీబీవీలో ఇటీవల పలువురు విద్యార్థినులు దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతూ ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థినులు ఎక్కువ ఆలోచించకుండా ఆడుతూ పాడుతూ సంతోషంగా చదువుపై దృష్టి సారించాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, విద్యార్థినులకు మంచి ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమ ంలో పీహెచ్‌సీ వైద్యుడు అమృత్ రాజ్ జైన్, హెల్త్ సూపర్ వైజర్ మార్తా, కేజీబీవీ ప్రత్యేక అధికారి సంగీతతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

తల్లీ, బిడ్డ క్షేమం

ఝరాసంగం(జహీరాబాద్): పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. మండలంలోని రామచంద్రనాయక్ తండాకు చెందిన బానోత్ సుజాతకు సోమవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. దీంతో ఈఎన్‌టీ సంగమేష్, పైలట్ సాగర్‌లు అంబులెన్సులో ఝరాసంగం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నా క్రమంలో మధ్యలోనే ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డలు క్షేమంగా ఉన్నారని మండల వైద్యాధికారి డాక్టర్ రమ్య తెలిపారు.



అంబులెన్సులో తల్లి, బిడ్డ